క్లుప్తంగా

రోజు వారీ వేతనం రూ.272 రావాలి

చిల్లకూరు: ఉపాధి హామీ పథకం కింద పని చేసే ప్రతి కూలీకి రోజు వారీ వేతనం రూ.272 రావాలని ఏపీఓ గిరి తెలిపారు. మండలంలోని మోమిడి సచివాలయం సమీపంలో గురువారం కూలీలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకంలో పనికి వచ్చే వారు, క్షేత్ర సహాయకులు ఇచ్చిన కొలతలు కచ్చితంగా చేయాలని, అలాగే ఎన్ని గుంతల పనులు చేస్తే కూలీ అంత ఎక్కువ మొత్తం సంపాదించవచ్చనే విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఆయన వెంట టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈసీ ఉన్నారు.

మెనూ పాటించాలి

పెళ్లకూరు: పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం విషయంలో మెనూ పాటించాలని ఎంఈఓ సుబ్రమణ్యం సూచించారు. గురువారం పాలచ్చూరు, పెరుమాళ్లపల్లె ప్రభుత్వ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు.

హనుమంతునిపై శ్రీమహావిష్ణువు



సైదాపురం: వైకుంఠపురంలోని శ్రీమహావిష్ణువు ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు గురువారం హనుమంత వాహనంపై విహరించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. వాహన సేవలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్ని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అన్నదానం చేశారు.

అంబేడ్కర్ జయంతికి ఏర్పాట్లు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన జయంతి వేడుకలను నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం ఉదయం సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సారథ్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

హద్దురాళ్ల ఏర్పాటు పరిశీలన

గూడూరురూరల్: జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకంలో భాగంగా రీసర్వే పూర్తి అయిన మండలంలోని పాలిచెర్లలో అగర్ మిషనరీ సాయంతో నాటుతున్న గ్రామ సరిహద్దు రాళ్ల ఏర్పాటును గురువారం సాయంత్రం ఆర్డీఓ కిరణ్‌కుమార్ పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ లీలారాణి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

దొరవారిసత్రం: తొగరాముడి, మీజూరు, కారికాడు, వేలికాడు, బేరిజంగాలపల్లెలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ముందస్తు వేడుకలు నిర్వహించి, జైభీమ్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యాసామగ్రి అందజేశారు. ఎంఈఓ మస్తానయ్య, ట్రస్టు ప్రతినిధులు ఎంవీ శేషయ్య, ఎం సిద్ధార్థ, గౌతమ్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సతీష్, కృష్ణయ్య, మోహన్‌కృష్ణా, బాబురావు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని మహిళ మృతి

గూడూరురూరల్: పంబలేరు వద్ద గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని రోడ్డు దాటుతున్న ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. రూరల్ పోలీసుల కథనం.. నారాయణ కళాశాల పక్కనే ఉన్న గిరిజనకాలనీకి చెందిన కొందరు కూలి పనులకు వెళ్లి తిరిగి వస్తున్నారు. పంబలేరు వద్ద కూలి ఈశ్వరమ్మ (40) జాతీయ రహదారి దాటుతున్న సమయంలో నెల్లూరు వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తమ కళ్ల ఎదుటే మృతి చెందడంతో సహచర కూలీలు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం అందిన వెంటనే రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సైకిల్‌పై కర్ణాటక వాసి కాశీ యాత్ర



నాయుడుపేట టౌన్: బెంగళూరులోని కేఆర్‌పురం ప్రాంతానికి చెందిన ముత్తుకుమార్ అనే వ్యక్తి సైకిల్‌పై కాశీ యాత్ర పూర్తి చేసి దైవ దర్శనం చేసుకున్నట్లు వెల్లడించారు. తిరుగు ప్రయాణంలో గురువారం నాయుడుపేట పట్టణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ముత్తుకుమార్ స్థానిక విలేకరులతో మాట్లాడారు. సైకిల్‌పై కాశీకి వెళ్లి దైవదర్శనం చేసుకోవాలని సంకల్పించి, చెన్నైకి వచ్చి అక్కడ నుంచి జనవరి 25 తేదీ బయలుదేరి సైకిల్‌పై కాశీ యాత్రను పూర్తి చేసి తిరిగి వస్తున్నట్లు తెలిపారు.

నాడు-నేడు పనుల పరిశీలన

సైదాపురం: మండలంలోని అనంతమడుగు సచివాలయం పరిధిలో జరుగుతున్న నాడు-నేడు పనులను గురువారం ఎంపీడీఓ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం మంచి పోషక విలువలున్న ఆహారం అందించాలని నిర్వాహకులకు సూచించారు. నాడు-నేడు పనులు నాణ్యతగా చేయాలన్నారు. అనంతరం సచివాలయాన్ని తనిఖీ చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు ప్రభుత్వం గ్రామ సచివాలయాలను ఏర్పాటు చేసిందని చెప్పారు.

మాట తప్పని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

చిల్లకూరు: ఇచ్చిన హామీలను 98 శాతం నేరవేర్చి, మాట తప్పని వ్యక్తిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేరు తెచ్చుకున్నారని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని చింతవరం సచివాలయ పరిధిలో గురువారం మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమం నిర్వహించారు. గిరిజన కాలనీ, దళితవాడ, గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి వారికి అందిన సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అనంతరం ఆ ఇంటికి జగన్న స్టిక్కర్‌ను అంటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై చంద్రబాబు పసలేని ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ ఓడూరు యమునమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మన్నెం శీనయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు చేవూరు నాగరాజు, సచివాలయ కన్వీనర్ వెదనపర్తి మనోజ్‌రెడ్డి, నాయకులు దువ్వూరు చిరంజీవి రెడ్డి పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట: మున్సిపాలిటీ పరిధిలోని ఇసుకమిట్టలో మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, ఏడో వార్డులో కౌన్సిలర్ సన్నారెడ్డి సౌజన్య, 18వ వార్డులో కౌన్సిలర్ కొండూరు జనార్దన్, 21వ వార్డులో పముజుల విజయలక్ష్మి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ, చెంగాళమ్మ ఆలయ పాలకమండలి సభ్యురాలు బండి సునీత, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ నిషా, పార్టీ నాయకులు గోగుల తిరుపాల్, అయితా శ్రీధర్, బండి రాజేష్, సుల్తానాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కోటలో..

కోట: శ్రీలక్ష్మమ్మ గిరిజనకాలనీ, నార్త్ గిరిజన కాలనీ, కోటమ్మగుడి గిరిజన కాలనీల్లో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ప్రసాద్ పాల్గొన్నారు.

ఓజిలిలో..

ఓజిలి: కొండవల్లిపాడు పంచాయతీలో చుట్టుగుంట ఎస్టీకాలనీలో నాయుడుపేట ఏఎంసీ మాజీ చైర్మన్, సర్పంచ్ కొండూరు ప్రభాకర్‌రాజు, జేసీఎస్ మండల కన్వీనర్ షేక్ ఖాదర్‌బాషా, పున్నేపల్లె పంచాయతీ కొత్తపేటలో పార్టీ తిరుపతి పార్లమెంట్ జిల్లా కార్యదర్శి పాదర్తి హరినాథరెడ్డి ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.

రాపూరులో..

రాపూరు: పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, కన్వీనర్లు పిచ్చిరెడ్డి, రమణయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి రమణయ్య, రామనారాయణ, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి రూరల్‌లో..

వెంకటగిరిరూరల్: మండలంలోని కుప్పంపల్లె, వర్ధనపల్లె, పాపమాంబపురం, పెట్లూరు, పారవోలు గ్రామాల్లో జేసీఎస్ రూరల్ మండల కన్వీనర్ ముళవాయిల వెంకటేశ్వర్లు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.

బాలాయపల్లిలో...

బాలాయపల్లి ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరు వెంకటప్రసాద్ సారథ్యంలో మండలంలోని అలిమిలి, అంబలపూడి, పిగిలాం కొత్తపాళెం, సుబ్రమణ్యం, గొట్టికాడు, కాలగంధ, నిడిగల్లు, కాట్రగుంట, పిగిలాం గ్రామాల్లో మా నమ్మకం నీవే జగనన్న కార్యక్రమం నిర్వహించారు.

గూడూరులో..

గూడూరు: పట్టణంలోని ఒకటో సచివాలయం పరిధిలో సచివాలయ కన్వీనర్ దాసరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. షేక్ బాబు, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేటటౌన్: అర్బన్‌తోపాటు మండలంలోని గిండివారితోటలో నిర్వహించిన కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, సచివాలయ కన్వీనర్ నారాయణరెడ్డి, వంశీ, ధనుంజయ పాల్గొన్నారు.

పెళ్లకూరు మండలంలో..

పెళ్లకూరు: మండలంలోని అనకవోలు, పెరుమాళ్లపల్లో గురువారం జరిగిన కార్యక్రమంలో నాయకులు సుధాకర్‌నాయుడు, చిరంజీవి, చంద్ర, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



చిల్లకూరు: మా నమ్మకం నీవే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు





సూళ్లూరుపేట: 21వ వార్డులో.. కౌన్సిలర్ విజయలక్ష్మి, ఇసుకమిట్టలో.. మున్సిపల్ చైర్మన్ శ్రీమంత్‌రెడ్డి



సూళ్లూరుపేట: సూళ్లూరులో.. సన్నారెడ్డి సౌజన్య



సూళ్లూరుపేట: గాండ్లవీధిలో..కొండూరు జనార్దన్



కోట: శ్రీలక్ష్మమ్మ గిరిజన కాలనీలో.. నేతలు



పెళ్లకూరు: పెరుమాళ్లపల్లెలో.. నాయకులు



చుట్టుగుంట ఎస్టీకాలనీలో ఖాదర్‌బాషా, ప్రభాకర్‌రాజు



రాపూరులో.. దందోలు నారాయణరెడ్డి







వెంకటగిరి రూరల్: కుప్పంపల్లెలో.. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, బాలాయపల్లి మండలం గొట్టికాడులో.. నాయకులు, గూడూరులో.. దాసరి వెంకటేశ్వర్లు



నాయుడుపేటటౌన్: గిండివారితోటలో..నేతలు

అర్హులందరికీ భూ పంపిణీనే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, చిత్రంలో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

గూడూరు: అర్హులందరికీ భూములు పంపిణీ చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం భూ పంపిణీకి సంబంధించి పేర్ల నమోదు కార్యక్రమాన్ని ఆర్డీఓ కిరణ్‌కుమార్, ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌లతో కలసి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గూడూరు పట్టణంతోపాటు, మండలంలోని పలు గ్రామాల నుంచి పేదలు భూముల కోసం అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూములు ఎన్నో ఏళ్లుగా మీ అనుభవంలో ఉండి, వాటిని మీరు సాగు చేసుకుంటుంటే, వాటిపై ఎలాంటి వివాదాలు లేకుండా ఉంటే, ఆ భూములను మీకు ఇప్పించేందుకే ప్రభుత్వం ఈ భూ పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. అ దిశగా ఎవరైనా సాగు చేసుకుంటుంటే, వాటిని పోరాడి మీకే ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ ఇది మనందరి ప్రభుత్వమని, మీరు సాగు చేసుకుంటున్న భూములు మీకే అందజేసేందుకు ఆర్డీఓతోపాటు తహసీల్దార్లు అండగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లీలారాణి పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

నాయుడుపేటటౌన్: అంబేడ్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు స్థానిక ప్రభుత్వ వైద్యులు, బ్లడ్ స్టోరేజీ సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ వెంకటరత్నం గురువారం తెలిపారు. రక్తదానం చేసి, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తం అందించి, ప్రాణదాతలు కావాలని డాక్టర్ వెంకటరత్నం కోరారు.

కార్యాలయాల తనిఖీ

సూళ్లూరుపేట: పట్టణంలోని మండల పరిషత్, రెవెన్యూ, గృహనిర్మాణశాఖ, నీటి పారుదలశాఖ కార్యాలయాలను గురువారం ఆర్డీఓ చంద్రముని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరుపట్టీ, ఇతర రికార్డులను పరిశీలించారు. మండల స్థాయి కార్యాలయాల్లో పనిచేసే అధికారులందరూ సమయపాలన పాటించాలని సూచించారు.

ప్రభుత్వ పథకాలే మళ్లీ గెలిపిస్తాయి



బ్రాహ్మణపల్లెలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి

కలువాయి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే 2024లో వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకువస్తాయని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి అన్నారు. కలువాయి మండలం బద్దెవోలు సచివాలయం పరిధిలోని బ్రాహ్మణపల్లెలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. 380 ఇళ్లకు వెళ్లి వారికి ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేశారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్ కుమార్‌రెడ్డి, ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి, ఎంపీటీసీ సభ్యులు దూడల ఆదెమ్మ, సర్పంచ్‌లు మంగల పెంచలమ్మ, దాసరి వెంకటమ్మ, పార్టీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, నాయకులు చల్లా రమణారెడ్డి పాల్గొన్నారు.

పౌరసేవల్లో జవాబుదారీతనం అవసరం

వెంకటగిరి: ప్రభుత్వపాలనను ప్రజల ముంగిటకే చేర్చేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సచివాలయవ్యవస్థ ఫలాలు ప్రజలకు అందాలంటే సచివాలయ సిబ్బందిలో జవాబుదారీతనం, పారదర్శకత ఉండాలని పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సూచించారు. స్థానిక ఆయన నివాసంలో గురువారం వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయాల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లోని అన్ని విభాగాలవారు వారి నిర్దిష్ట సేవలను అందించడానికి సమయపాలన పాటిస్తేనే సచివాలయాల పాత్ర, ప్రయోజనాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేయగలరన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బీవీ రామయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడి సాధ్యం



మాట్లాడుతున్న ప్రసాద్‌రావు

వెంకటగిరి రూరల్: రైతులు పంటలు సాగు చేసే సమయంలో భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడితోపాటు నాణ్యమైన పంటను సాధించవచ్చని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు పేర్కొన్నారు. మండలంలోని వల్లివేడులో గురువారం భూసార పరీక్షలపై మండలస్థాయి శిక్షణ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతు ప్రయోజనాల కోసం గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు సాగు సమయంలో సమీప ఆర్బీకే నుంచి భూ సార పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ఇందుకోసం వీఏఓలు, అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. భూమి సారవంతం పెంచుకోని అనువైన పంటలు సాగు చేస్తే మంచి ఫలితాలు పొందవచ్చని సూచించారు. తిరుపతి ఏడీఏ ధనంజయరెడ్డి, ఏడీఏ నాగార్జున సాగర్, ఏఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

గూడూరు: పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్-23 కోసం ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపల్ రవికృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ తరగతులు ఈ నెల 17 నుంచి, మే 6వ తేదీ వరకూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ జరుగుతాయన్నారు. పాలిసెట్-23లో రిజిస్టర్ చేసుకున్న వారు ఈ ఉచిత శిక్షణకు అర్హులన్నారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోనివారు, ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.400, ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు రూ. 100తో రిజిస్టర్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 98498 07725, 99123 42070, 99123 22600, 99890 85540 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

పోలేరమ్మ హుండీ ఆదాయం రూ.2.20 లక్షలు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది, విద్యార్థులు

నాయుడుపేటటౌన్: గ్రామ దేవత పోలేరమ్మ హుండీలో కానుకలను గురువారం దేవాదాయశాఖ గూడూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, కార్యనిర్వహణాధికారి పాయసం శాంతరావు సమక్షంలో లెక్కించారు. హుండీలో మొత్తం రూ.2,20,055 వచ్చినట్లు ఈఓ వెల్లడించారు. హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని బ్యాంక్ ఖాతాలో జమ చేస్తున్నట్లు తెలిపారు. పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ గంధవల్లి సిద్ధయ్య, ఎస్‌ఐ శ్రీకాంత్, మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటకృష్ణారెడ్డి, గాదిరెడ్డి గోపి, కౌన్సిలర్‌లు పాపాడి చంద్రారెడ్డి, పాలేటి నాగార్జున, గంధవల్లి భరత్, సాధు మోహన్, చెంచు కిషోర్, ముద్దపాటి శ్రీకాంత్, పసల హరిబాబు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు విస్తృతం చేయాలి

పెళ్లకూరు: సచివాలయాల్లో ఆధార్ సేవలను అందరూ సద్వినియోగం చేసుకునేలా విస్తృతం చేయాలని ఎంపీడీఓ సురేష్‌బాబు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి సచివాలయంలోనూ ఆధార్ ప్రక్రియ కొనసాగుతుందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆధార్‌కు మొబైల్ నంబర్, మెయిల్ ఐడీ లింక్ చేయడం, బయోమెట్రిక్, పేరు, చిరునామా, పుట్టిన తేదీ తదితర సవరణలు చేసుకునే అవకాశం ఉందన్నారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి

చిట్టమూరు: మెట్టు జెడ్పీ హైస్కూలులో గురువారం అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం రాజ్‌కుమార్ మాట్లాడుతూ నేటి యువత అంబేడ్కర్‌ని స్ఫూర్తిగా తీసుకుని, ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివపార్వతి, శంకరమ్మ, శ్రీలక్ష్మి, ఖాదర్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

వెంకటగిరి: ఏపీ హైకోర్టు న్యాయవాది జి వెంకటేశ్వర్లుపై బాలాయపల్లి పోలీసులు దాడి చేసిన ఘటనకు నిరసనగా వెంకటగిరి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం విధులు బహిష్కరించినట్లు ఆ అసోసియేషన్ నాయకులు బాబ్జీ, ప్రధాన కార్యదర్శి పి రాంప్రసాద్ తెలిపారు. వారు మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు పెరుగుతున్న నేపథ్యంలో న్యాయవాదుల సంరక్షణ చట్టం అమల్లోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఏ హేమగాంధీ, సహాయ కార్యదర్శి డి గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

చిల్లకూరు: చిన్నపాటి ఉద్యోగం చేస్తూ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తూ సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ఆర్డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కడివేడు పంచాయతీలోని మూడు గిరిజన కాలనీల్లో 150 మంది పిల్లలు, వృద్ధులకు చిల్లకూరుకు చెందిన పీపుల్స్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషన్ సంస్థ ద్వారా గురువారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు పోతుగుంట మల్లికార్జున్, అరుణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు అంబేడ్కర్ జయంతి

వెంకటగిరి: స్థానిక కాంపౌండ్‌లో శుక్రవారం ఉదయం 9.00 గంటలకు అంబేడ్కర్ జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బీవీ రామయ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు చైర్మన్, నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేటటౌన్: సీఎం జగన్ మోహన్ రెడ్డి సారథ్యంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళుతున్నామని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మండలంలోని కాపులూరు పంచాయతీలోని వాసుదేవపురం, దరఖాస్తు కండ్రిగ, పొనకట్ట, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే సంజీవయ్య ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించి, ఇప్పటివరకు వారు పొందిన పథకాలను గురించి తెలిపే బుక్‌లెట్‌లను అందజేశారు. సమస్యలను తెలుసుకుని కొన్నింటిని అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కారించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు హారతులిచ్చి, స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ కుల మతాలకతీతంగా ప్రభుత్వ పథకాలను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ ఒట్టూరు కిషోర్ యాదవ్, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ తంబిరెడ్డి జనార్దన్ రెడ్డి, కామిరెడ్డి రాజారెడ్డి, కాపులూరు సర్పంచ్ బుదూరు భూదేవమ్మ, వైస్ ఎంపీపీ నెలవల మమత, ఎంపీటీసీ సభ్యుడు రాయపు శంకరయ్య పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ర్యాలీ చేస్తున్న ఎస్‌ఈబీ అధికారులు, విద్యార్థులు

డక్కిలి: మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ సంతోషం కలిగించేలా నేటి యువతరం ఉండాలని ఎస్‌ఈబీ అధికారులు పిలుపునిచ్చారు. స్థానిక డీకేఎం డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలసి గురువారం గ్రామంలో మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వెంకటగిరికి చెందిన ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు మాట్లాడుతూ నేటి యువత మత్తుకు బానిసలు అవుతున్నారని, దీంతో ప్రాణాల మీదకు తెచ్చుకుని అటు తల్లిదండ్రులకు, ఇటు సమాజానికి తీరని నష్టం కలగించేలా ఉంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ గంగాధర్, హెడ్ కానిస్టేబుల్ మునిశేఖర్, సిబ్బంది పుట్టయ్య, ఎస్‌కే రఫీ, ఎం పుల్లయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న నేతలు

చిట్టమూరు: మండలంలోని ఆరూరు పంచాయతీలో రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులను వైఎస్సార్ సీపీ నేతలు గురువారం ప్రారంభించారు. రెండు నెలల క్రితం గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు ఈ పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా తమ గ్రామంలో సీసీ రోడ్లు లేవని ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే సిమెంట్ రోడ్లు వేసేందుకు పంచాయతీకు రూ.10 లక్షలు నిధులు మంజూరు చేయించారు. దీంతో రాఘవవారిపాళెం, ఆరూరు మిట్ట దళితవాడల్లో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు దేవారెడ్డి సుధాకర్‌రెడ్డి, పెళ్లూరు సురేంద్రరెడ్డి, పంచాయతీ రాజ్ అధికారి జగదీష్, టెక్నికల్ అసిస్టెంట్ కార్తీక్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనపై సర్వే

చిల్లకూరు: గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతుల కల్పనపై సర్వే చేస్తున్నామని నాబార్డు అధికారులు ఎంపీడీఓ విష్ణు చిరంజీవికి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వారు ఎంపీడీఓతో సమావేశం నిర్వహించారు. అనంతరం తమ్మినపట్నంలోని పలు ప్రాంతాలను పరిశీలించి, అక్కడ మౌలిక వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తీర ప్రాంతంలోని పలు పరిశ్రమలకు చెందిన యాజమాన్యాలు సీఎస్ఆర్ కింద ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నాయన్న విషయాలను కూడా పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు. సింహపురి జిందాల్ పవర్ ప్రాజెక్టు యాజమాన్యంతో కలసి మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుడుతున్నామని తెలిపారు. త్వరలోనే అన్ని గ్రామాల్లో నాబార్డు ద్వారా నిధులు మంజూరు చేసి తాగునీరు, మరుగుదొడ్లు, మురుగుకాలువల నిర్మాణం, పేద విద్యార్థులు బడికి వెళ్లి చదువుకునేలా చూడడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో నాబార్డు ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ పీ రమేష్ బాబు, ప్రాజెక్టు కోఆర్డినేటర్ కృష్ణకుమారి, ప్రాజెక్టు మేనేజర్ రాజ్‌కుమార్, సూపర్‌వైజర్ మణికంఠ, టీం లీడర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.